క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం



తిరువూరు: 2025 మెగా డీఎస్సీలో గంపలగూడెం మండలం నుంచి ఎంపికైన 20 మంది నూతన ఉపాధ్యాయులను, వారి తల్లిదండ్రులను పీఆర్టీయూ ఆధ్వర్యంలో వారివారి ఇళ్ల వద్ద శుక్రవారం సన్మానించారు. గంపలగూడెం మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు నేరెళ్ల రంగనాథ్, జిడుగు రమేష్, తిరువూరు, గంపలగూడెం, ఎ కొండూరు మండలాల టీచర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు నరెడ్ల సంజీవ రెడ్డి, మేరుగు జయశీలరావు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ



తిరువూరు: నేటి డిజిటల్ యుగంలో కూడా ఆడపిల్లలపై ఎన్నో ఆంక్షలు పెడుతున్నారని, వారిపై అఘాయిత్యాలు నిత్యకృత్యం అయిపోయాయని కంభంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం జె. ఆదిశేషు అన్నారు. జన విజ్ఞాన వేదిక రూపొందించిన 'ఎదిగే ఆడపిల్ల ఏమి తెలుసుకోవాలి' పుస్తకాన్ని శుక్రవారం హైస్కూల్‌లో ఆవిష్కరించి విద్యార్థులకు పంపిణీ చేశారు. సమాజంలో ఎలా మెలగాలి అని తెలుసుకోవాలంటే ప్రతి ఆడపిల్ల, వారి తల్లిదండ్రులు తప్పక చదవాలని కోరారు. పుస్తకాలను పాఠశాలలో బాలికలకు ఆంగ్ల ఉపాధ్యాయిని అంబటి లీలాప్రసన్న పంపిణీ చేశారు.

బాణసంచా దుకాణాల ఏర్పాట్ల పరిశీలన



మైలవరం: మైలవరం తిరువూరు రోడ్డులోని ఎస్ఎస్‌కే స్కూల్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు స్థలాన్ని తహసీల్దార్ అబ్దుల్ దరియా ఎస్ఐ సుధాకర్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. దుకాణదారులకు తహసీల్దార్ పలు సూచనలు చేశారు. షాపునకు, షాపునకు మధ్య దూరం ఉండాలని, ప్రతి షాపు వద్ద అగ్ని ప్రమాద నివారణ పరికరాలను ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్రీకృష్ణదేవరాయలుకు నివాళి

తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలనులో శుక్రవారం షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాయలు పాలనలో విజయనగర సామ్రాజ్యం అత్యున్నత స్థాయికి చేరుకుందని, తెలుగు సాహిత్యానికి స్వర్ణయుగమని, తెలుగు కవితా రచన ఆముక్తమాల్యదను ఆయన రచించారని, దేశ భాషలందు తెలుగులెస్స అని ఎలుగెత్తి చాటిన శ్రీ కృష్ణదేవరాయలు గొప్పకవి అని సాయిబాబా సేవా కమిటీ అధ్యక్షుడు వూటుకూరు నారాయణరావు వివరించారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు.

మురుగు తొలగించాలి



నూజివీడు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల పక్క రోడ్డులో రహదారిపైనే మురుగు నీరు నిల్వ ఉండటంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సమస్యపై పలు మార్లు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు పుట్రేలలో 'కోటి సంతకాల సేకరణ'

విస్సన్నపేట: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ తలపెట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శనివారం ఉదయం 9 గంటలకు పుట్రేల గ్రామంలో నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఓలేటి దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరువూరు నియోజకవర్గ పరిశీలకుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి తంగిరాల రామిరెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ఓంకార్‌కు నివాళి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మాజీ ఎమ్మెల్యే, ఎంసీపీఐ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఎం.ఓంకార్ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం కొండపల్లి పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఓంకార్ చిత్రపటానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్, మండల కార్యదర్శి కలకంటి బసవయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కాసాని గణేష్‌బాబు, వల్లెపు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాగులో నిర్మాణం.. వరదతో అవస్థలు

- చిన్న నందిగామ వద్ద పిల్లవాగులో ఎత్తు పెంచి కాంక్రీటు నిర్మాణం
- వరద పోటెత్తి పంట భూములు, ఎస్సీ కాలనీ మునక
- భవిష్యత్‌లో వరద ముంపు తప్పదని స్థానికుల ఆందోళన
- సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు



భీమవరప్పాడు వద్ద పిల్లవాగుపై నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కల్వర్టు



సమస్యాత్మక కల్వర్టును పరిశీలిస్తున్న తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు

జి.కొండూరు: జి.కొండూరు మండల పరిధి చిన్న నందిగామ, భీమవరప్పాడు, కోడూరు గ్రామాలకు జంక్షన్‌గా ఉన్న ప్రదేశంలో రహదారి పక్కన కోడూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కమర్షియల్ భవనాన్ని నిర్మించారు. అయితే భవనానికి ఎదురుగా పిల్లవాగుపై నిర్మించిన కల్వర్టుతోనే ఇప్పుడు సమస్య తలెత్తింది. రహదారి పక్కనే ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న ఈ పిల్లవాగుపై నిర్మించిన కల్వర్టు నిబంధనలకు విరుద్ధంగా వరద ప్రవాహానికి అడ్డుగా ఎత్తుగా నిర్మించడంతో వర్షం పడితే వరద పోటెత్తుతోంది. ఒక వైపు బుడమేరు, మరో వైపు పిల్లవాగు వరదతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

ముంపునకు గురవుతున్న సాగు భూములు

పిల్లవాగుపై నిర్మించిన కల్వర్టు వద్ద అడుగు భాగాన కాంక్రీటు బెడ్డు ఎత్తుగా నిర్మించడంతో పాటు కల్వర్టు పరిమాణం సైతం ఇరుకుగా నిర్మించడంతో సమస్య ఉత్పన్నమైంది. మైలవరం మండల పరిధిలోని చంద్రాల నుంచి వచ్చే పిల్లవాగు వర్షం పడినప్పుడు భారీ వరద ప్రవాహంతో ఉధృతంగా ప్రవహించి ఈ భవనం నిర్మించిన ప్రదేశానికి పక్కనే బుడమేరులో కలుస్తోంది. అయితే ఈ భవనానికి ముందు నిర్మించిన కల్వర్టు వల్ల వరద ప్రవాహం సక్రమంగా ముందుకు సాగక వరద పోటెత్తి చిన్న నందిగామ, కోడూరు, భీమవరప్పాడు గ్రామాలకు చెందిన వంద ఎకరాల సాగు భూమి వరద ముంపునకు గురవుతోంది.

కాలనీలోకి వరద ప్రవాహం

ఈ కల్వర్టును ఎత్తుగా నిర్మించడం వల్ల కోడూరు శివారు కొండల్లో నుంచి వచ్చే వరద ప్రవాహం పిల్లవాగులో కలిసి బుడమేరులో కలవాల్సి ఉండగా కల్వర్టు వద్ద పోటెత్తి వ్యతిరేక దిశలో భీమవరప్పాడు ఎస్సీ కాలనీ వైపు మళ్లి కాలనీలో 60 ఇళ్ల వరకు ఇటీవల ముంపునకు గురయ్యాయి. ఇక్కడ ఎస్సీ కాలనీలో 300 వరకు ఇళ్లు ఉండగా 600లకు పైగా జనాభా నివాసం ఉంటున్నారు. ఒకవేళ భారీ వర్షం పడిన సమయంలో బుడమేరుకు వరద పోటెత్తి పిల్లవాగుకు కూడా వరద ఉధృతి పెరిగితే ఎస్సీ కాలనీ మొత్తం నీటి ముంపునకు గురవుతుందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కల్వర్టును తొలగించి వాగు వెడల్పును, లోతును బట్టి నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

సర్వే చేపట్టిన అధికారులు

పిల్లవాగులో నిబంధనలకు విరుద్ధంగా కల్వర్టు నిర్మాణం చేపట్టడంపై రైతుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ అధికారులు శుక్రవారం సమస్యాత్మక ప్రదేశాన్ని పరిశీలించి సర్వే చేశారు. స్థానికులకు, రైతులకు సమస్య తలెత్తకుండా కల్వర్టు తొలగించడమా, లోతు పెంచడమా అనేది చర్చించి నిర్ణయం తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.



పామాయిల్ తోట కోతకు గురవుతోంది

పిల్లవాగు మీద ఇష్టారాజ్యంగా కల్వర్టు నిర్మించడంతో మా పామాయిల్ తోట ఐదు ఎకరాలు ముంపునకు గురైంది. వాగు వెంట కోతకు గురై గండ్లు పడ్డాయి. అదేమిటని ప్రశ్నిస్తే ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. కల్వర్టు వెంటనే తొలగించి వెడల్పుగా, లోతుగా నిర్మించుకోవాలి. లేదంటే మా భూములు బుడమేరులో కలిసిపోతాయి.

– ఉప్పు హర్షవర్ధన్, రైతు, చిన్ననందిగామ గ్రామం



ఇళ్లు మునిగిపోతున్నాయి

పిల్లవాగు మీద ఎత్తు పెంచి కల్వర్టు నిర్మించడంతో వరద పోవడానికి వీలులేక వరద మొత్తం మా ఎస్సీ కాలనీ వైపు మళ్లి రెండు బజార్లలో ఇళ్లు మునిగాయి. కొద్దిపాటి వర్షం పడినా వరదంతా కాలనీ వైపు వస్తోంది. కల్వర్టు వెంటనే తొలగించాలి. లేదంటే మా కాలనీ మొత్తం బుడమేరులో కలిసిపోతుంది

– పత్తిపాటి పెద్దబాబు, గ్రామస్తుడు, భీమవరప్పాడు



వర్షం పడితే భయమేస్తోంది

కొద్దిపాటి వర్షం పడినా కొండల్లో వరదంతా పిల్లవాగులోకి పోకుండా కాలనీ వైపు వస్తోంది. కొత్తగా నిర్మించిన కల్వర్టు వల్లనే ఈ సమస్య నెలకొంది. అధికారులు వెంటనే స్పందించి కల్వర్టు తొలగించాలి. లేకుంటే వర్షం కురిసిన ప్రతిసారి కంటిమీద కునుకు ఉండదు. కాలనీ అంతా వరద భయంతో ఆందోళన చెందుతున్నారు.

– లింగాల కొండలరావు, గ్రామస్తుడు, భీమవరప్పాడు



వరద భయంతో నిద్ర పట్టడంలేదు

ఒక పక్కన బుడమేరు, మరో పక్కన పిల్లవాగు. అసలే వరద భయంతో నిత్యం భయపడుతూ ఉంటుంటే పిల్లవాగుపై నిర్మించిన కల్వర్టుతో వరదంతా పోటెత్తి మా కాలనీ వైపు వస్తోంది. వర్షం కురిస్తే ఏ క్షణాన ఏమి జరుగుతుందోనని భయంతో బతకాల్సి వస్తోంది. అధికారులు వెంటనే కల్వర్టును తొలగించాలి.

– పజ్జూరు తిరుపతిరావు, గ్రామస్తుడు, భీమవరప్పాడు

మీడియాపై రెడ్‌బుక్ రాజ్యాంగం తగదు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, వైఎస్సార్ సీపీ నాయకులు

జి.కొండూరు: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపే 'సాక్షి' మీడియాపై రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని వైఎస్సార్ సీపీ మైలవరం మండల కన్వీనర్ గన్నెపూడి వెంకట్రావు, మైలవరం పట్టణ అధ్యక్షుడు పాల నారాయణరెడ్డి అన్నారు. 'సాక్షి' దినపత్రికలో కథనాలపై పోలీసులు 'సాక్షి' ఎడిటర్ ఆర్. ధనంజయరెడ్డికి నోటీసులు ఇవ్వడం, అక్రమ కేసులు బనాయించడం, ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేస్తున్న క్రమంలో ప్రభుత్వ వైఖరిని మార్చుకోవాలని కోరుతూ జర్నలిస్టులతో కలిసి వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ అబ్దుల్ దరియాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పసుపులేటి చైతన్య, మన్నె సాంబశివరావు, చిలుకూరి రాజారెడ్డి, బుద్దారపు వెంకట్రావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తోట తిరుపతిరావు, 'సాక్షి' ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ దాడులు

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి సెక్షన్ పరిధిలో పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ ఎ.సత్యనారాయణ ఆధ్వర్యంలో 44 బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారికి జరిమానాలు విధించారు. మొత్తం 3,429 సర్వీసులు తనిఖీ చేయగా 138 సర్వీసులకు రూ. 5.24 లక్షల అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఈఈ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దాడుల్లో విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిజాలను వెలుగులోకి తెస్తే నిందలా ?



మాట్లాడుతున్న ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి, జెడ్పీటీసీ కె.సువర్ణరాజు

విజయవాడరూరల్: కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న కల్తీ మద్యం వ్యాపారాన్ని వెలుగులోకి తీసుకువచ్చిన మాజీ మంత్రి జోగి రమేష్‌పై ఆరోపణలు చేయడం ఎంతవరకు సబబు అని విజయవాడ రూరల్ ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి, జెడ్పీటీసీ కె.సువర్ణరాజు ప్రశ్నించారు. పైడూరుపాడు గ్రామంలో ఎంపీపీ ప్రసన్న కుమారి శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఇబ్రహీంపట్నంలో కల్తీ మద్యం వ్యాపారాన్ని మాజీ మంత్రి జోగి రమేష్ వెలుగులోకి తీసుకువస్తే ఆయనపై కూటమి పాలకులు కేసులు పెట్టేందుకు కుట్రలు పన్నడం ఏమిటన్నారు. తప్పుడు ప్రచారం చేస్తూ బెదిరింపులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించారు. జెడ్పీటీసీ సువర్ణరాజు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులపై కేసులు పెట్టడం సరికాదన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బి.రవికిశోర్ మాట్లాడారు. మహిళా నాయకురాలు ఖాసీం, జిల్లా కార్యదర్శి కొమ్ముకూరి ప్రసాద్, సర్పంచి వి.సీతారామయ్య, వెంకటరత్నం పాల్గొన్నారు.

సీజేఐ గవాయ్‌పై దాడికి నిరసన



చాట్రాయిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మైలవరం: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ బీఆర్ గవాయ్‌పై ఇటీవల జరిగిన దాడి హేయమైన చర్య అని ఎమ్మార్పీఎస్ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంకొల్లు జమలయ్య అన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు మైలవరం ఆర్‌అండ్‌బీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శుక్రవారం నల్ల జండాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ అబ్దుల్ దరియాకు వినతిపత్రం అందజేశారు. నిందితుడిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కోట బెనర్జీ, కొంగల రామారావు, బండారి శరత్, పత్తిపాటి ఏసు, ఓలేటి ఏసు, సువర్ణరాజు, చాట్ల వీరాస్వామి పాల్గొన్నారు.

- **చాట్రాయి:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి అమానుషమని, దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించి డెప్యూటీ తహసీల్దార్ ఈశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎం. రవికిరణ్, కె.జోజి, జయరాజ్, జి.నాగేశు, కొమ్ము ప్రసాదు, దుర్గం పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.
- **ముసునూరు:** ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎం.రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ముసునూరులోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జి తొమ్మండ్రు రుద్రయ్య, వెంపటి వెంకటేశ్వరరావు, కె. విలియం తదితరులు పాల్గొన్నారు.

జోగి రమేష్‌పై అసత్య ఆరోపణలు మానుకోవాలి

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి ప్రకాష్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

విస్సన్నపేట: మాజీ మంత్రి జోగి రమేష్‌పై కూటమి ప్రభుత్వం చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి శిరసాని ప్రకాష్ అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. నకిలీ మద్యం తయారీ కేంద్రాన్ని పట్టించి, నకిలీ మద్యం తయారీ వెనుక ఎవరు ఉన్నారో వారిని కఠినంగా శిక్షించాలని మాజీ మంత్రి కోరారని చెప్పారు. నకిలీ మద్యం తయారు చేసి విక్రయిస్తుంటే సంబంధిత అధికారులు ఎందుకు పట్టుకోలేదని ప్రకాష్ ప్రశ్నించారు. కక్షపూరితంగా లేనిపోని ఆరోపణలు చేసి మాజీ మంత్రి జోగి రమేష్‌పై అక్రమ కేసు బనాయించాలని చూస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముంగా జయరాజు, ఉమ్మడి కృష్ణా జిల్లా బీసీ సంఘం వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ చింతగుంట్ల వెంకటేశ్వరరావు, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కోపల్లి జయకర్‌బాబు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



ఎన్టీటీపీఎస్ కొత్తగేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎన్టీటీపీఎస్ కొత్తగేటు వద్ద శుక్రవారం కాంట్రాక్ట్ కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించి తెలంగాణ రాష్ట్రం తరహాలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పీస్ రేట్ వర్కర్లను కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించాలన్నారు. కార్మికులకు ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు చేపట్టాలని, పని ప్రదేశంలో మహిళలకు భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం వద్దు

జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ

తిరువూరు: ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది కలుగకుండా తగు ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ పేర్కొన్నారు. శుక్రవారం తిరువూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పీఏసీఎస్, రైతు సేవా కేంద్రాలలో సిబ్బందికి ధాన్యం కొనుగోలుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు తేమ శాతాన్ని అనుసరించి మద్దతు ధర లభించేలా సిబ్బంది చూడాలని సూచించారు. రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాలు, పౌరసరఫరాల సిబ్బంది, మిల్లర్లు ధాన్యం కొనుగోలుకు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఆర్డీఓ మాధురి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. జీఎస్టీ రాయితీలపై జరిగిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

పశువులకు వైద్య సేవలు

జి.కొండూరు: మండల పరిధి కోడూరు గ్రామంలో సత్యసాయి సేవా సమితి (సీతారాంపురం విజయవాడ) ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఆవులు, గేదెలు, జీవాలు, కుక్కలకు వైద్య పరీక్షలు చేశారు. పశువులకు మినరల్ మిక్సర్‌లు, మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ వంగూరి ప్రసాద్, పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.హరిహరనాథ్, వెలగలేరు పశు వైద్యాధికారి డాక్టర్ హరీష్, సేవా సమితి గ్రామ సేవల ఇన్‌చార్జ్ టీజేఆర్ గుప్తా, సేవాదళ్ కో–ఆర్డినేటర్ ఎన్.తులసీరాం, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

తిరువూరు: ఎ.కొండూరు మండలం కోడూరు రైతు సేవా కేంద్రంలో ఏర్పాటుచేసిన ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం అందించే కనీస మద్దతు ధరకు విక్రయించుకోవాలని కోడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ కృష్ణారావు రైతులకు సూచించారు. కార్యక్రమంలో సహకార సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

ముసునూరు: తల్లిదండ్రులపై దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదైంది. ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొర్లగుంట శివారు సింహాద్రిపురానికి చెందిన పిన్నిబోయిన వెంకటేశ్వరరావు, ధనలక్ష్మిలను గడ్డిమోపును ఇంటిలో పెట్టే విషయంలో కలుగజేసుకుని కుమారుడు వెంకటరామయ్య, కోడలు వీరమ్మ కొట్టగా, గాయాలవడంతో నూజివీడు ఏరియా ఆసుపత్రిలో వారు చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా పోటీలకు ఎంపిక

తిరువూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా స్థాయి పోటీలకు మునుకుళ్ల జిల్లా పరిషత్ విద్యార్థినులు ఎంపికయ్యారని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం జి. రామకృష్ణ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నరసాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డివిజన్ స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో మునుకుళ్ల పాఠశాల నుంచి అండర్ 17 పోటీల్లో బి. అఖిల, అండర్ 14 విభాగంలో షేక్ షమ ఎంపికయ్యారని చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ వేణికృష్ణమ్మను పాఠశాల హెచ్‌ఎం, సిబ్బంది అభినందించారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

నూజివీడు: దిగవల్లిలోని కేఎంఎస్ హైస్కూల్ విద్యార్థి కోపూరి విశ్వంత్ అండర్–14 విభాగంలో జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.కిశోర్ శుక్రవారం తెలిపారు. విస్సన్నపేట మండలం నర్సాపురం హైస్కూల్‌లో నిర్వహించిన డివిజన్ స్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరచడంతో విశ్వంత్ జిల్లా స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థిని హైస్కూల్ చైర్మన్ ఎస్.నాగరాజు, డైరెక్టర్ ఎ.రాకేష్, కరస్పాండెంట్ జి.వెంకట గోపాలరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికే డిజిటల్ ప్లాట్‌ఫామ్

నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న



డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ వినూత్న

నూజివీడు: నూజివీడు డివిజన్‌లోని యువతీ యువకులు తమ సృజనాత్మకత, డిజిటల్ నైపుణ్యాలు, సామాజిక బాధ్యతను ప్రదర్శించడానికి ఫ్రమ్ నూజివీడు ఉయ్ లీడ్ అనే ప్రత్యేక డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించామని నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న అన్నారు. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా యువత ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలను అధికారులకు, ప్రజలకు చేరవేయడానికి అవకాశం లభిస్తుందన్నారు. ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్స్, డిజిటల్ మీడియా, వీడియో, ఫొటో డాక్యుమెంటేషన్ల ద్వారా ప్రభుత్వంతో పాటు నూజివీడు అభివృద్ధిలో భాగస్వాములు కావచ్చన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారు. యువతకు డిజిటల్ కమ్యూనికేషన్, సోషల్ మీడియా అవుట్‌రీచ్, సృజనాత్మక ఆలోచనలు, సమాజంపై సానుకూల ప్రభావం చూపే మార్గాలపై చర్చించారు. యువత తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇది గొప్ప అవకాశమని చెప్పారు. సోషల్ మీడియాపై ఆసక్తి ఉన్నవారు పాల్గొని సామాజిక దృక్పథంతో తమ వంతుగా సమాజంలో జరిగే పరిణామాలు, సమస్యలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమంపై వీడియోలు తయారు చేయవచ్చన్నారు. డివిజన్‌లో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఎక్కడ అపరిశుభ్రంగా ఉన్నా ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా తెలియజేస్తే 48 గంటల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. నూజివీడు, ఆగిరిపల్లి ఎంపీడీఓలు చెన్నా రాఘవేంద్రనాథ్, బి.భార్గవి, మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదు తప్పనిసరి



చాట్రాయి: రైతులు ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ అన్నారు. చాట్రాయిలో ఈక్రాప్ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు తమ పంటలను ఈ నెల 25వ తేదీ లోగా నమోదు చేసుకోవాలని చెప్పారు.

దర్గాను సందర్శించిన మైనార్టీ మోర్చా అధ్యక్షుడు బాషా

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని ప్రసిద్ధ హజ్రత్ సయ్యద్ షాబుఖారి దర్గాను మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సయ్యద్ బాషా శుక్రవారం సందర్శించారు. ఆయనను ఆస్థాన పీఠాధిపతులు అల్తాఫ్ రజా సాదరంగా ఆహ్వానించి ఇస్లాం సంప్రదాయం ప్రకారం సన్మానించారు. దర్గాలో ప్రార్థన చేశారు. అనంతరం షాబుఖారి బాబా నిత్యాన్నదాన లంగర్ ఖానాలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

మైలవరం: వ్యాస రచన, మష్రూమ్ రెసిపీ తయారీ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇళ్ల రవి, అధ్యాపకులు, సిబ్బంది శుక్రవారం అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇటీవల విజయవాడ శ్రీదుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సెమినార్‌లో మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని గాయని ప్రథమస్థానం, మష్రూమ్ రెసిపీ తయారీ పోటీల్లో బీఎస్సీ వృక్షశాస్త్రం ప్రథమ సంవత్సరం విద్యార్థిని సుజినీ ప్రథమస్థానంలో నిలిచారని చెప్పారు. వీరిని కళాశాల వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జె. రాముడు, వైస్ ప్రిన్సిపాల్ పి. రంగారావు, అధ్యాపకులు అభినందించారు.